"పో స్ట్!..." అంటూ పోస్ట్‌మేన్ విసిరిన కవరు తిన్నగా వచ్చి నా కాళ్ళ దగ్గర పడింది.

ఈజీఛైర్‌లో తీరుబడిగా పేపరు చదువుకుంటున్న నేను పేపరు పక్కనపెట్టి, కవరు తీసి చూసి ఆశ్చర్యపోయాను.

సాధారణ కవరుకంటే కాస్త వెరయిటీగా ఉందా కవరు. అడ్రసు చూసాను. నాదే. పోస్టుమేన్ కరెక్ట్‌గానే ఇచ్చాడు. ఫ్రమ్ అడ్రస్ చూసి మరీ ఆశ్చర్యపోయాను. అది ఒక సాహిత్య సమాజంనుంచి వచ్చిన కవరు. అదేదో సాహిత్య సభకు పిలిచే ఆహ్వానపత్రిక అనుకుని కవరు చించి, నీలంరంగులో ఉన్న ఉత్తరం చదివి సంతోషించాలా, విచారించాలా అనే డైలమాలో పడ్డాను.

"మాస్టారూ... మీకు మా సంస్థ తరపున



# నాలాగా ఎందరో...!!

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇవ్వాలని నిర్ణయించాం. మీ సర్వీస్ పర్టిక్యులర్స్‌తోపాటు మీ బయోడేటా అర్జంట్‌గా పంపండి."

ఇట్లు సాహితీ సంస్థ తరఫున
అధ్యక్షులు

అని ఉంది.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఏమిటి?..., ఒక సాహితీ సంస్థ ఇవ్వడమేమిటి...? దానికి విలువ ఉందా... అసలు నా గురించి వీరికేం తెలుసు?... నా అడ్రస్ ఎలా సంపాదించారు? మొదలైన ప్రశ్నలు నాలో మొలకెత్తాయి.

"ఏంటండీ ఆ కవరూ?... ఏంటలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు...?" లోపలినుంచి వచ్చిన నా శ్రీమతి నా చేతిలోని ఉత్తరం తీసుకొని గబగబా చదివింది.

నాలా ఆశ్చర్య అనుమానాలకు లోనుకాకుండా ఎక్కడలేని ఆనందంతో ఆమె ముఖం వెలిగిపోతోంది.

భర్తను గౌరవించి సన్మానిస్తామంటే ఏ భార్య సంతోషపడదూ?

"దీనికి ఇంత ఆలోచన ఏమిటండీ... అసలు గవర్నమెంటు మిమ్మల్ని ఎప్పుడో గుర్తించవలసింది. పోనీ వీళ్లయినా మిమ్మల్ని గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ ఇస్తామంటున్నారు. అంతే చాలు..." తన అభీష్టాన్ని వ్యక్తపరచింది నా భార్య సుశీల.

"ఓ ప్రైవేటు సంస్థ నుంచి అవార్డు అంటే నాకెందుకో అంతగా రుచించడంలేదు సుశీ... అదే మా డిపార్ట్‌మెంట్ ద్వారా అయితే అదెంతో ఘనమైనది... గౌరవించదగ్గది. అయినా మనకంతటి లక్కేదీ...?" అన్నాను.

"అసలు లేదంటే నిండా కొలవమన్నారట మీలాంటివారే. వాళ్లేదో మీకు అవార్డు ఇస్తామంటే అది మంచిదేనా, వగైరా అనుమానాలేమిటండీ?... ముందా అవార్డు రానీయండి... మిగతావి వాటంతట అవే వస్తాయి. తొందరగా మీ బయోడేటా పంపండి" ఇస్తున్న అవార్డ్ చేజారిపోతున్నట్టు తొందరపెట్టింది సుశీల.

"సిన్సియారిటీ... పంక్చువాలిటీ మెయిన్‌టైన్ చేస్తూ నేనొక ఆదర్శ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాను. నా పై అధికారుల్లో మంచి గౌరవం, తోటి ఉపాధ్యాయుల్లో అభిమానం సంపాదించుకొన్న నాపట్ల విద్యార్థులు భయమూ భక్తీ కలిగి ఉంటారు.

నేను ఏ బడిలో పనిచేస్తే ఆ బడిని మరికాస్త మెరుగుపరిచే ప్రయత్నంచేస్తాను. ఆ విధంగా ఏ పాఠశాల వెనుకబడి ఉంటుందో ఆ పాఠశాలకు ఇష్టపూర్వకంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకొని, ఆ బడిని అన్ని విధాలా బాగుచేయడానికి ప్రయత్నిస్తాను.

ఇదంతా దృష్టిలో పెట్టుకొని, నా పై అధికారులు, నా తోటి టీచర్స్ నన్నొక ఆదర్శ ఉపాధ్యాయునిగా గౌరవిస్తారు.

**కొండవలస శ్రీనివాసరావు**

ఇక అవార్డ్ అంటే...

ఒకరి మెప్పుకోసంగాని మెహర్బానీకోసం గానీ నేను ఎప్పుడూ పనిచేయలేదు. బడిలో పాఠాలు చెప్పడం నా ధర్మం. జీతం తీసుకుంటున్నందుకు నేను చేయవలసిన కర్తవ్యమది.

అవార్డులనాశించి పనిచేస్తే... ఎంతని పని చేయగలం? అనే ఆత్మవిమర్శతో పనిచేసే ఉపాధ్యాయుణ్ణి నేను.

"అలా అనకండి... చేస్తున్న పనికి ప్రోత్సాహాన్ని ఇచ్చేవి ఈ అవార్డులు. అవార్డు వచ్చిందనే ఆనందంతో తమ పనిని మరింత మెరుగు పరచుకోవడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి అవార్డు అనేది ప్రోత్సాహకరమైనది. అది తప్పకుండా పొందాలి" అంది సుశీల.

సుశీలమాటలకు "నా విద్యుక్తధర్మంలో లోటేమైనా ఉందా సుశీ"? అడిగాను.

"ఛా...ఛా... అసలు మీరు మీ విద్యుక్తధర్మాన్ని తూచ తప్పక పాటిస్తున్నారు. అది అందరికీ తెలిసిందే. ఎటొచ్చీ ఆ రావలసిన గుర్తింపే ఇంకా రాలేదు" నిష్కర్షగా అంది సుశీల. "ఏమైతేనేం... కోరకుండానే అవార్డు ఇస్తామంటున్నారు. నా కోసమైనా ఈ అవార్డు ప్రపోజల్స్ పంపండి" చెప్పింది సుశీ.

సుశీల సంతృప్తి కోసమైనా ఈ అవార్డు ప్రపోజల్స్ పంపించే పనిలో నిమగ్నమయ్యాను.

★ ★ ★

నేను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ప్రపోజల్స్ పంపించిన వారం రోజుల్లో టెలిగ్రామ్ ద్వారా మెసేజి వచ్చింది... నాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇస్తున్నట్టు. ఈ విషయం అన్ని వార్తాపత్రికల్లో వేయించండి... అంటూ తెలియజేసారు. నేను నిశ్చేష్టుడినయ్యాను.

నాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు! ఇది కలా... నిజమా? అనే సందిగ్ధంలో ఉండగానే సాహితీ సంస్థ నుంచి వచ్చిన వేరొక కవరు ఇచ్చి వెళ్ళాడు పోస్ట్‌మేన్. ఆతృతగా కవరు చించి, విషయం చదివిన నేను అధఃపాతాళానికి క్రుంగిపోయాను. ఉత్తరం నా చేతి నుంచి తీసుకొని సుశీలా చదివింది.

"ఈ ఉత్తరం అందిన వెంటనే టెలిగ్రామ్ మనియార్డర్‌ద్వారా ఐదు వేల రూపాయలు పంపించండి. తరువాత ప్రముఖ సాహితీ వేత్త చేతులమీదగా మిమ్మల్ని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరిస్తాము."

షరా: మీరు ఐదువేల రూపాయలు పంపనిచో మీకు ఇవ్వబోయే అవార్డు వేరొకరికి ఇవ్వబడుతుంది.


ఇదీ ఉత్తరం సారాంశం.

"ఇదేమిటండీ... అవార్డుని ఐదువేల రూపాయలు ఇచ్చి కొనుక్కోమంటున్నారు. ఇదెక్కడి చోద్యమండీ" సుశీల నిష్ఠూరం.

"అందుకే మొదటినుంచీ ఇటువంటి ప్రైవేటు అవార్డులంటే ఎందుకో నాకు ఇష్టం లేకుండాపోయింది. నీ బలవంతం మీద ప్రపోజల్ పంపాను. ఇప్పుడు చూడు... అవార్డ్ కొనుక్కోమంటున్నారు. అవార్డులు అభ్యర్థి యొక్క సామర్థ్యానికి మెరిట్ ప్రతిపాదికన ఇస్తారనేది సహజం. కానీ వీళ్ళేమిటి... డబ్బు పంపిస్తే అవార్డ్ ఇస్తారట, లేకపోతే వేరొకరికి ఇస్తారట.

తలచుకుంటేనే నాకు కంపరమెత్తుతోంది.

"ప్రైవేటు అవార్డులు అలాగే ఉంటాయి గాబోలునండీ. మీరు కాకపోతే వేరొకరు...




అవార్డులు కొనుక్కునేవారుంటే అమ్మేవారు ఉండరా? మీరెందుకంతగా బాధపడతారు?" ఓదార్చింది సుశీల.

పదిరోజుల తరువాత పేపర్లో వచ్చింది మా పక్క స్కూలు ఉపాధ్యాయుడు సుయోధన నాయుడికి అవార్డు ఇస్తున్నట్టు. అంటే ఈ సుయోధననాయుడు ఐదువేల రూపాయలు ఇచ్చి అవార్డు కొనుక్కున్నాడన్న మాట.

అసలు ఈ సుయోధననాయుడు స్కూల్‌కి సరిగ్గా వెళ్ళడు, పాఠాలు చెప్పడు. ఎప్పుడూ పొలిటీషియన్లతో తిరుగుతాడని అంటారు. అటువంటివాడు అవార్డు కొనుక్కోక స్వతహాగా వస్తుందా? నా మనసు తృప్తిపడింది.

"అయిందేదో అయింది... మీరు అనవసరంగా దీని గురించి ఆలోచనలతో మనసు పాడుచేసుకోకండి..." సుశీల ఓదార్చింది.

★ ★ ★

ఆ అవార్డు గురించి మరిచిపోతున్న తరుణంలో ఒకరోజు రామారావు మాష్టారు మా స్కూల్‌కి వచ్చారు.

"మాష్టారూ... ఇవిగో ఈ కాగితాలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకై పంపవలసిన ప్రపోజల్స్. వీటిని నింపి కావలసిన కాగితాలు సమకూర్చుకుని, మన ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గారికి వారంలోగా అందజేయాలి. మన ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గారు ఈ కాగితాలు మీకు ఇచ్చి నింపి పంపమన్నారు. ఈ విషయం మీకు మరీ మరీ చెప్పమన్నారు.

అవార్డ్ అంటేనే భయమేస్తోంది. ఏదో నేరం చేస్తున్నట్టు గిల్టీ ఫీలింగ్. అది బయటకు కనపడనీయకుండా -

"నాకెందుకులెండీ ఈ అవార్డు. వేరొకరిని పెట్టుకోమనండి..." అన్నాను.

"భలేవారు మాష్టారూ... అసలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి మీకంటే అర్హులు ఎవరు ఉన్నారండీ..." అన్నారు రామారావు మాష్టారు.

"ఏదో నామీద అభిమానం కొద్దీ అలా అంటున్నారు కానీ... నేనొక్కడినే ఉత్తమ ఉపాధ్యాయుడిననే స్వార్థం నాలో లేదండీ"

"ఎంతమాట!... అసలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అన్నివిధాలా మంచి ఉపాధ్యాయుణ్ణి ఎంచి ఇచ్చే అవార్డు. అటువంటివారిలో మీరు మొదటివారు. అందుకే మన ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గారు మీ పేరు ప్రపోజ్ చేసి ఈ కాగితాలు మీకు ఇచ్చిరమ్మన్నారు. వేరే ఆలోచించక కాగితాలు నింపి పంపండి..." అంటూ రామారావు మాష్టారు వెళ్ళిపోయారు. వెళ్లిపోతున్న ఆయన్ని చూస్తూ ఉండిపోయాను.

"ఇది మీ డిపార్టుమెంటు తరుపున కదండీ... ఇందులో మీరు భయపడవలసినంతగా లొసుగులేమీ ఉండవు. మీదుమిక్కిలి మీ ఆఫీసర్‌గారే స్వయంగా మిమ్మల్ని ప్రపోజు చేసారంటున్నారు కనుక తప్పక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్‌కి అప్లయ్ చేయండి"... చెప్పింది సుశీల.

ఒక అనుభవం తరువాత తిరిగి అదే పని చేయడం ఇష్టం లేకున్నా మా ఆఫీసర్‌గారి ప్రోత్సాహంతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి అప్లయ్ చేసాను.

★ ★ ★

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రకటించారు. అందులో నా పేరు లేదు. అయినా క్రుంగిపోలేదు. కానీ అవార్డుకి ఎన్నుకున్న విధానమే నన్ను క్రుంగదీసింది. అసలెందుకిలా జరుగుతోందో తెలీదు...

మా ప్రక్క మండలం ఉపాధ్యాయిని ధనలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటించారు. ధనలక్ష్మి టీచరు కొన్నేళ్లక్రితం చీటీలు నడిపి, ప్రజలను ఛీటింగ్ చేసి సుమారు లక్ష రూపాయలు కైంకర్యం చేసి పరారయింది. అప్పుడే ఆమెను సస్పెండ్ చేసి కేసు నడిపారు. జైలుకు కూడా వెళ్ళింది. ఇదంతా ఆ రోజుల్లో పేపర్లలో సీరియల్స్‌గా వచ్చింది. తరువాత ఎవరో పెద్ద నాయకుణ్ణి పట్టుకుని అదంతా మాఫీ చేయించి, తిరిగి సర్వీసులో చేరింది. ఇదంతా కొన్నేళ్లక్రితం మాట. ఇప్పుడామెకు హైదరాబాద్ లెవెల్లో పలుకుబడి ఉందంటారు. రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయంటారు. అటువంటామెకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటించారు. ఇలా ఆలోచిస్తూండగా రామారావు మాష్టారు వగరుస్తూ నా దగ్గరకు వచ్చారు.

"సారీ మాష్టారూ... మీకు రావలసిన అవార్డు ఆ ధనలక్ష్మి టీచరుకు ఇచ్చారు. అసలు మిమ్మల్నే ఏకగ్రీవంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రపోజ్‌చేస్తూ అధికారులు పంపారు. అక్కడ హైదరాబాద్‌లో ఆఖరిక్షణంలో పెద్ద ఒత్తిడి వచ్చి మీకు బదులు ధనలక్ష్మి టీచర్‌కి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటించారట. ఇదంతా లోపాయికారీ విషయం. ఏంచేస్తాం మాష్టారూ!... మన సమాజం అలా ఉంది. ఎంతో మెరిట్ కలిగి అన్నివిధాలా అర్హత కలిగిన మీకీ అవార్డు గాలేదంటే అసలు ఆ అవార్డుకే చిన్నతనం మాష్టారూ. బాధపడకండి" అంటూ రామారావు మాష్టారు వెళ్లిపోయారు.

ఎంత మెరిట్, సేవా ధృక్పధం ఉన్నా అదంతా చెప్పుకోవడానికేగానీ దేనికీ పనికిరాదు. ఏదైతేనేం రెండవసారి భంగపడిన నేను ఏమని చింతించను? ఈ సమాజధృక్పధంలో నాలా ఎందరో నష్టపోతున్నారో... నాకు తెలిసి నేనొక్కణ్ణే నష్టపోయాననుకుంటున్నాను. కానీ అమ్ముడుకానికో అవార్డు... సిఫార్సుకో అవార్డూ ఇచ్చే ఈ సమాజంలో నాలాగా ఎందరో?...

ఆలోచించవలసిందే!... ●